క్లుప్తంగా

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న జగన్‌కుమార్

నల్లగొండ టౌన్ : మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.వెంకటేశ్వర్లును మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి వెంకట్, పోలె జయకుమార్, కత్తుల కాశీ, కత్తుల గోవర్ధన్, మాతంగి లింగస్వామి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాంపల్లి: మండలంలోని పస్నూర్ గ్రామానికి చెందిన నల్లవెల్లి వెంకటయ్య మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. వెంకటయ్య మృతదేహాన్ని నాంపల్లి జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్, సలువాది రాములు, జానీ, సైదులు, సైదిరెడ్డి, ధనంజయ్య, పంబాల వెంకటయ్య, నిరంజన్, తదితరులు ఉన్నారు.

శబరికి వెళ్లిన దర్వేశిపురం ఆలయ అర్చకులు



శబరి బయలుదేరుతున్న అర్చకులు

కనగల్: దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ అర్చకులు అయ్యప్పమాల ధరించి 41రోజుల దీక్ష అనంతరం మంగళవారం ఇరుముడ్లు కట్టుకుని అయ్యప్ప స్వామి దర్శనానికి శబరి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకుడు చిలకమర్రి శ్రవణకుమారాచార్యులు, అర్చకులు గాదె దామోదర్, గాదె మహేష్, జూనియర్ అసిస్టెంట్ కూసం ఉపేందర్‌రెడ్డి, బస్వరాజు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సత్కారం



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నల్లగొండ: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్ల గొండ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలుపొంది మంత్రి పదవి చేపట్టడంతో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాసరి ప్రీతి ప్రశాంత్, డి.ప్రశాంత్‌కుమార్, డేవిడ్ రాజు, పి.సైమన్, ఎం.రవికుమార్, ఎం యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న మేడి చంద్రస్వామి

మునుగోడు: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి వెంటనే అమలు చేయాలని మునుగోడు నియోజకవర్గ మాదిగ జేఏసీ ఇన్‌చార్జ్ మేడి చంద్రస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మునుగోడులో జరిగిన మాదిగ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 18,19 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. మాదిగలంతా భారీగా తరలివచ్చి ఎస్సీ వర్గీకరణ సాధనకు మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండు పరుశరామ్, పందుల సురేష్, అందుగుల కృష్ణ, జీడిమడ్ల రమేష్, లింగస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి



చంద్రశేఖర్(ఫైల్)

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం సర్వారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు దారమళ్ళ చంద్రశేఖర్(55) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. తాపీ మేస్త్రీ అయిన చంద్రశేఖర్ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో పని చేశారు. 2014 నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో పని చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అర్ధాకలితో 'పది' విద్యార్థులు

- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- అల్పాహారం అందక అవస్థలు



మర్రిగూడ హైస్కూల్‌లో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మర్రిగూడ: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉండాలని ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. అయితే పాఠశాలల్లో విద్యార్థులకు అందుకు తగిన మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు డిసెంబర్ మొదటి నుంచి వార్షిక పరీక్షల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మర్రిగూడ మండలంలో 8 జెడ్పీహెచ్ఎస్‌లు ఉన్నాయి. మండలంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 99 మంది విద్యార్థులు, మండల కేంద్రంలోని పాఠశాలలో 62 మంది, కస్తూరిబాలో 29 మంది, దామెరభీమనపల్లిలో 14, యరగండ్లపల్లిలో 15, శివన్నగూడలో 22, కుదభాక్షపల్లిలో 21 మంది విద్యార్థుల చొప్పున ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొత్తం 262 మంది పదో తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కస్తూరిబాగాంధీ పాఠశాలను మినహాయిస్తే మిగతా 233 మంది విద్యార్థులు అర్ధాకలితో పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు.

చదువుపై దృష్టి సారించలేకపోతున్న విద్యార్థులు

అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 30 వరకు ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30గంటల వరకు ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. జనవరి 1 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఇతర గ్రామాల నుంచి పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం సమయంలో ఇంటి వద్ద భోజనం ఏర్పాటు కాకపోవడంతో ఖాళీ కడుపుతోనే పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. దీంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. గతంలో విద్యార్థులకు బిస్కెట్స్ లేదా ఇతర అల్పాహారం అందించేవారు. కరోనా సమయం నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణ లేకపోవడంతో విద్యార్థులకు అల్పాహారం అందించడంలేదు. దాతలు సహకరించి విద్యార్థులను అర్ధాకలి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

తినకుండానే వస్తున్నాం



మా గ్రామం లింగోటం నుంచి ఉదయం ఏమి తినకుండానే పాఠశాలకు వస్తున్నాం. మధ్యాహ్న భోజనం పెట్టేంతవరకు వేచి చూడాల్సి వస్తుంది. మొదటి పిరియడ్‌లో రాగి జావ ఇస్తున్నారు. పాఠశాలలో అల్పాహారం అందిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవు.

–దుబ్బ కావ్య, పదో తరగతి, మర్రిగూడ హైస్కూల్

అల్పాహారం అందిస్తే శ్రద్ధగా చదువుకుంటాం



నెర్లపల్లి నుంచి పాఠశాలకు సైకిల్‌పై వస్తున్నా. ఒక్కోసారి ఇంట్లో టైంకు భోజనం కావడం లేదు. తినకుండానే రావాల్సి వస్తోంది. సాయంత్రం ఇంటికి వెళ్లాలంటే నీరసంగా ఉంటోంది. ఏమైనా అల్పాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉండి మరింత శ్రద్ధగా చదువుకోగలుగుతాం.

–ఎస్‌కె.నవీన్‌బాబా, పదో తరగతి, దామెరభీమనపల్లి పాఠశాల

ప్రత్యేక నిధులు కేటాయించాలి



గతంలో కలెక్టర్ చొరవతో సీఎస్ఆర్(కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించేవారు. ఎన్ఆర్ఐలు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ప్రభుత్వం ప్రత్యేక తరగతులకు నిధులు కేటాయిస్తే బాగుంటుంది.

–నీరుడు అంజయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం, మర్రిగూడ

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



చండూరు : సమ్మె చేస్తున్న ఉద్యోగులు

చండూరు : తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకుడు నవీన్‌కుమార్ అన్నారు. ఏఐజీడీఎస్‌యూ, ఎన్ఎయూజీడీఎస్ కేంద్ర సంఘాల పిలుపు మేరకు మంగళవారం చండూరు తపాలా కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్ మంజూరు, 5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, కావ్య, సునీత, సంతోష, క్రాంతి, సైదాబీ, హాతిరాం, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : ఏఐజీడీఎస్‌యూ, ఎన్ఎయూజీడీఎస్ కేంద్ర సంఘాల పిలుపు మేరకు మంగళవారం తపాలా కార్యాలయాల ఎదుట తపాలా ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్ మంజూరు, 5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యాదగిరి స్వామి, శ్రీనివాస్, అరుణ, నగేష్, అనిత, యాదయ్య, సింధు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణరెడ్డి

చిట్యాల: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై చిట్యాల పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పరిసర ప్రాంతాల్లోకి ఎలక్ట్రిక్ వస్తువులను తీసుకెళ్లవద్దని, లిఫ్టులలో ప్రయాణించవద్దని సూచించారు. ఇంటిలో గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదం సంభవించినప్పుడు సిలిండర్‌పై కాటన్ క్లాత్ వేసి మూసివేసి మంటలను ఆర్పివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బండి వీణాఅనిల్‌కుమార్‌రెడ్డి, స్కూల్ డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ పోలా గోవర్ధన్, రాము పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన కొండె లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం ఆమె మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన పాలెం వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకుడు బట్టు అయిలేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చిట్యాల మండలంలోని బొంగోనిచెర్వు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. సర్పంచ్ సామిడి మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ గునమల్ల నరేష్, రామాలయ చైర్మన్ పాబిడి సాయికృష్ణారెడ్డి, పామిడి యాదిరెడ్డి, కట్ట కిరణ్, శ్యామ, కందాటి మహేందర్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సురుగురు కృష్ణారెడ్డి, కందాటి మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ కార్యకర్త మృతి



లక్ష్మీనారాయణ(ఫైల్)

కనగల్: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ముఖ్య కార్యకర్త, పిల్లి రామరాజు ప్రధాన అనుచరుడు బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన లక్ష్మీనారాయణ(40) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, ఏఐఎఫ్‌బీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి రామరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డిలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట స్థానిక సర్పంచ్ గుండెబోయిన నర్సింహ, రాజు, ఎడ్ల గణేశ్, లింగయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

మునుగోడు: భువనగిరి పార్లమెంట్ పరిధిలోని గ్రామాలకు అధిక నిధులు మంజూరుచేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బచ్చనబోయిన సాయిచరణ్‌యాదవ్ మంగళవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను ఢిల్లీలో కలిసి విన్నవించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ స్థానం కైవసం చేసుకునేందుకు పార్టీ సమావేశాలు, సభలు నిర్వహించాలని కోరినట్లు సాయిచరణ్ తెలిపారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

నల్లగొండటౌన్: అమావాస్య సందర్భంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎంసీహెచ్ ప్రాంగణంలో రోగుల కుటుంబ సభ్యులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాతలు, నిర్వాహకులు గుండా రమేష్‌బాబు, భవాని మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు 500 మందికి అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కోటగిరి రామకృష్ణ, రేపాల భద్రాద్రి రాములు, వీరెల్లి సతీష్, నూనె సతీష్, వనమా గోపి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

చండూర్ : ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరామ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు తొలిమెట్టుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం విరామ సమయంలో నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపిక పట్ల ఆయా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లచ్చిరామ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైదులు, నాగరాజు, ఎ.శ్రీను, కిషన్, ప్రసాద్, కట్ట రామకృష్ణ, యాదగిరి, సైదులు, మల్లేశం, బాలస్వామి, భిక్షం, సంధ్య, భారతి, మమత, లక్ష్మి, రాణి, పావని, ఇన్నషమ్మ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



మునుగోడు : మాలధారులకు అన్నదానం

మునుగోడు : మండల కేంద్రంలో మంగళవారం అయ్యప్ప పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి పోలె వెంకన్న, మిరియాల రామశంకర్, సాగర్ల లింగస్వామి, జిట్టగోని సైదులు, ఎల్లేష్, బెల్లి పూర్ణ, మునుగోటి సాయి, పందుల రాజేష్, రవి, పాలకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప మాలధారులకు మండల కేంద్రానికి చెందిన పగడాల శ్రీశైలం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొక్కులు తీర్చుకునేందుకు పాదయాత్ర



చిట్యాలలో పాదయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, కోమటిరెడ్డి బ్రదర్స్, వేముల వీరేశం గెలవాలని నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో సోమవారం పాలెం గ్రామంలోని పుర్మగిరి సుందర లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదాద్రికి పాదయాత్రగా బయలుదేరారు. పాదయాత్ర మంగళవారం నార్కట్‌పల్లికి చేరకుంది. పాదయాత్రలో ఆవుల వేణు, ఎలిజాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేసుకుంటూ మంగళవారం చెర్వుగట్టుకు చేరుకున్నారు. పాదయాత్రలో గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల మల్లేష్, సర్పంచ్ కడమంచి సంధ్యాస్వామి, నరేష్, సత్తయ్య, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు స్వాగతం

చిట్యాల: నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం విజయం సాధించడంతో రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చెర్వుగట్టు ఆలయం వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం చిట్యాలకు చేరుకుంది. పాదయాత్ర బృందానికి చిట్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ ప్రెసిడెంట్ ఎడ్ల మహాలింగం, మహేష్, చంటి స్వాగతం పలికారు. పాదయాత్ర బృందంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగుల వెంటరాజిరెడ్డి, కర్రె స్వామి, మేకల మల్లేశం, నాగులంచ నరేష్, కడారి సత్తయ్య, మేడి మల్లేశం పాల్గొన్నారు.

'క్యాంపు కార్యాలయంలో సామగ్రి భద్రం'

మిర్యాలగూడ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం సమకూర్చిన సామగ్రి భద్రంగానే ఉందని, ఆర్‌అండ్‌బీ డీఈ గణేశ్‌కుమార్ తెలిపారు. సామగ్రి అక్రమంగా తరలించారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ప్రభుత్వం నుంచి 2018లో కేటాయించిన రూ.1కోటి నిధులకు అదనంగా అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు రూ.20లక్షల వ్యయంతో అదనపు నిర్మాణాలు చేశారన్నారు. ప్రజలు కూర్చొనేందుకు ప్రత్యేకంగా షెడ్, లిఫ్ట్ ఏర్పాటు చేశారన్నారు. ఖాళీ చేసే సమయంలో లిఫ్ట్ కూడా ఉంచి వెళ్లారన్నారు. ప్రభుత్వ నిధులతో సమకూర్చిన సామగ్రి భవనంలోనే ఉందన్నారు.

ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి పార్వతీపరమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు గోశిక నర్సింహవెంకటలక్ష్మి, భావనాఋషి దివ్య, సుంచు రాజు, మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, బడుగు శ్రీరాములు, లలిత, శివ, పావని, ధనుంజయ్య, వెంకటేశం, నరసింహులు పాల్గొన్నారు.

'దివీస్' సేవలు అభినందనీయం

చౌటుప్పల్ : ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దివీస్ పరిశ్రమ అందిస్తున్న సహకారం అభినందనీయమని కొయ్యలగూడెం ఎంపీటీసీ జెల్ల ఈశ్వరమ్మ అన్నారు. మంగళవారం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల చెందిన విద్యార్థులకు దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో స్కూల్‌బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్లు కైరకొండ అశోక్, వర్కాల రఘురాం, మాజీ సర్పంచ్ మాచర్ల కృష్ణ, దివీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, ఎస్.సాయికృష్ణ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మిర్యాలగూడ టౌన్ : ఒడిషా రాష్ట్రంలోని రాంచీలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ ప్రసాద్ సాహు నివాసంలో జరిగిన ఐటీ అధికారుల దాడుల్లో అవినీతి డబ్బు దాచడాన్ని నిరసిస్తూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో సాహు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్యాం, గిరి, సీతారాంరెడ్డి, రామచంద్రారెడ్డి, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, రాజీరెడ్డి, వేణు, రమణ, మైనార్టీ నాయకులు భాష, పెదమాం భరత్, సైదులు, అశోక్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

అసంపూర్తిగా టాయిలెట్లు



జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో రోగుల కుటుంబ సభ్యుల కోసం నిర్మిస్తున్న టాయిలెట్లు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ఆడపిల్లలు మనోధైర్యంగా ఉండాలి

నాంపల్లి : ఆడపిల్లలు మనోధైర్యంగా ఉండాలని ఐసీడీఎస్ చింతపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. మంగళవారం నాంపల్లి మండలంలోని పెద్దాపురం ఆదర్శ పాఠశాల, పస్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బేటీ పఢావో-బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల అమ్మకాలు, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శశికళ, వసంత తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మునుగోడు : బాల్య వివాహాల నిర్మూలన, గృహహింస చట్టం, లింగ నిష్పత్తిపై మునుగోడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు డీడబ్ల్యూఓ కృష్ణవేణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ కవిత, ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు సరస్వతి, రోజా, సుజాత, రంగమ్మ, పారిజాత, వివేషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



రామకోటి స్థూప ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఛాయా సోమేశ్వర ఆలయ ఆవరణలోని కోనేటిలో దీపాలు వదులుతున్న భక్తులు



ఛాయా సోమేశ్వర ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కార్తీక మాసం ముగింపు సందర్భంగా నల్లగొండలోని శివాలయాల్లో మంగళవారం భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బీట్ మార్కెట్‌లో గల రామకోటి స్థూప ఆలయం, పచ్చల, ఛాయా సోమేశ్వర ఆలయాలు, తులసీనగర్ భక్తాంజనేయ స్వామి సన్నిధిలోని శివాలయంలో భక్తులు పూజలు చేశారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ